# అగ్రహారంలో ఒక పిల్లి

మా ఊరు చాలా అందమైన ఊరు. మా అగ్రహార వీధి చాలా అందమైనది. మా అగ్రహారంలో ఉన్నవారందరుకూడా చాలా అందంగా ఉంటారు. అందం అంటే మీరేం అనుకుంటున్నారో నాకు తెలియదు. నన్ను అడిగితే దేనిగురించి ఐనా తలపు వచ్చినవెంటనే మనసుకు సంతోషంగా ఉందంటే అది చాలా అందంగా ఉండి తీరాలి. ముప్పై ఐదు సంవత్సరాల ముందు అక్కడ ఒక వీధిలో ఒక పాత గర్భగృహంలాగ అంధకారం నిండిన గదిలో పుట్టి, ఆ వీధి చెత్త చెదారంలో ఆటలాడి, ఆ ఊరు మనుషుల ప్రేమకీ, కోపానికీ పాత్రై, పెరిగి, ఇప్పుడు విడిపోయి, ఇరవై ఐదు సంవత్సరాల తరువాతకూడా ఆ తలపులూ, అనుభవాలూ, చింతించడానికే ఆనందంగా ఉన్నాయంటే, అవన్నీ చక్కని, అందమైన తలపులూ, అనుభవాలే కదా?

నేను చూసిన ఊరు - ఇవి ఎన్నటికీ మారవు అని దృఢంగా నమ్మడానికి సరిగ్గా ప్రాచీనమైన ఆ ఇళ్ళూ, 'వీళ్ళకీ నవ్యతకీ ఎటువంటి సంబంధమూ లేదు ' అని ఖరారుగా చెప్పలేని మనుషులూ - ఇప్పుడూ ఇలాగే ఉన్నారు అనే ఆలోచనలో ఒక విధమైన అందమూ, సుఖమూ ఉంది.

నేను ఇప్పుడు బాగా పెరిగిపోయాను; చాలా కొత్త సంగతులు తెలుసుకున్నాను. నా దగ్గర ఉండే కొంటెతనం, చేష్టలు, అన్నీ పోయాయి. ఐనాకూడా కల్పనలో ఇన్ని మైళ్ళ దూరం నుంచి ఆ ఊరు వీధిని ప్రవేశించినప్పుడు - కల్పనలో దూరాన్ని మాత్రం దాటగలమా? - నేను ఆ కాలాన్ని దాటి ఒక పదేళ్ళ బాలుడుగా ఊరులోకి దూరాను.

చెరువుగట్టు మలుపులో నేను వస్తూంటే నా రాకను కొంచంకూడా లెక్క చెయ్యక ఆ స్త్రీలు స్నానం చేస్తుంటే నేను ఒక



మెట్టులో కొంచం సేపు కూర్చుంటాను. అక్కడ మంచి గాలి వస్తుంది. చెరువులోని నీరుకి ఒక అడుగుకి పైగా చేపలు తుళ్ళిపడి గెంతుతాయి. గులకరాళ్ళను తీసుకొని చెరువులో విసురుతూ ఎంత కాలమైనా అక్కడ కూర్చోగలం; ఎక్కడెక్కడో వెళ్ళి ఏం సాధించాలని?

నా మిత్రులు వెంకిట్టు, ఉత్తండం, సుందరం, దండపాణి, అందరూ ఆడవారి స్నాన గట్టాలకూ, మగవారి స్నానగట్టాలకూ మధ్య ఉన్న ఒక గోడమీద వరుస వరుసగా వచ్చి చెరువులోకి దూకుతారు; తరువాత తడిసిన గోచీని భిగించి కట్టుకొని మళ్ళీ చెరువులోకి దూకడానికి గోడమీద వచ్చి నిలబడతారు.

నేను ఎప్పుడూ ఒంటరివాడిని. వాళ్ళు నన్నెప్పుడూ వాళ్ళతో కలుపుకోరు. వాళ్ళ దృష్టిలో నేను చెడ్డవాడిని.

నేను ఒంటరిగా ఆ కుర్రకాయలతో చేరక నెమ్మదిగా కూర్చుండడం చూసిన కొందరు పెద్దవాళ్ళు నన్ను ఉదాహరణంగా చూపుతారు. నేను అల్లరి చెయ్యకుండా ఉత్తికే కూర్చొని ఉన్నానట; నా అణకువ, నింపది చూసి వాళ్ళకి నా మీద ప్రేమ. "పాపం, వాడినికూడా మీతో చేర్చుకొండిరా . . పరవాలేదు, నువ్వు నాతో రా . . వాళ్ళు నిన్ను టలో చేర్చుకోపోతే నువ్వేం తక్కువాడైపోలేదు . . నేను నీకు పిండివంటలు ఇస్తాను .. కాఫీ గింజలు నూరడానికి వెళ్దాం, వస్తావా?" అనే వాళ్ళ అభిమానం నా మనసుకి వెచ్చగా ఉంటుంది. నేను వాళ్ళకి కాఫీ గింజలు నూరడం నుంచి కాలు నొక్కడం వరకు అన్ని పనులూ చేస్తాను. మా అమ్మ అడుగుతే మాత్రం ఏ పనీ చెయ్యను. "పో పో!" అని పరుగెడతాను.

నాకు పదేళ్ళవడానికి ముందే మా అమ్మకి ఐదుగురు పిల్లలు. తల్లి ప్రేమ, ఆశ్రయం అనేది నాకు జ్ఞాపకంలోకూడా లేదు.

నా అమ్మ నన్ను పిలవడమే " ఒరే పెధవా!" అనే. ఊరులో, వీధిలో, తక్కినవారికి నేను మంచి పిల్లవాడుగా కనిపించినా ఇంటిలో నేను చాలా అల్లరి చేస్తాను.

ఏం అల్లరి? ఒక పిల్లవాడు పరుగెత్తుకొని వస్తాడు; నేను అడ్డదిడ్డంగా కాలు పెడతాను . . కింద పడిన పిల్లవాడి గడ్డం నుంచో లేక పళ్ళనుంచో రక్తం కారుతుంది; నేను అలాగే నెమ్మదిగా కూర్చుంటాను. ఆ పెధవ పిల్లలి మాట్లాడడం రాకపోయినా ఏడుస్తూనే నా పక్కన చెయ్యి చూపి నేనే వాళ్ళ గతికి కారణమని చేప్పేస్తారు.

"పెధవా! అంతా చేసేసి ఏమీ తెలియనట్టు పిల్లిలాగ కూర్చున్నావా?" అని అమ్మ వచ్చి వీపు మీద రెండు వడ్డించి, " నా చెయ్యంతా మండుతోందిరా దొంగ పెధవా!" అని తిట్టి, నన్ను తరుముతుంది.

"ఏమే, ఎందుకు వాడిని కొడతావ్? పాపం, వాడికి ఏమీ తెలియదు, " అని ఎవరైనా - ఎదురింటిలో నుంచి ఆంటీ వచ్చి నేను ఏడ్చిన తరువాత నాకు సమాధానం చెప్పి తీసుకెళ్తారు; అప్పచ్చి ఇచ్చిన తరువాత నేను ఊరుకుంటాను. కాని అక్కడకూడా 'నెమ్మదిగా ఏమైనా తుంటరితనం చేసేస్తాను; కాఫీ గింజలు నూరే మెషినులో మన్ను పోసేసి గభీమని, " ఇదిగో చూడండి, ఎవరో మెషినులో మన్ను పోసేసారు," అని అరుస్తాను.

"మరెవరు, అది తప్పక మా ఇంటి అబ్బాయే ఐ ఉండాలి," అని వాళ్ళ ఇంటి యజమానుని వదకి పట్టుకొని అతను నాకు నలుగు వడ్డిస్తేనే ఒక సంతోషం, ఒక నెమ్మది



నా అమ్మ మాత్రం నా మీద సానుభూతి చూపే ఆడవాళ్ళని హెచ్చరిక చేస్తూ ఉంటుంది. " . . వాడిని నమ్మకండి . . చూస్తే మాత్రం ఏమీ తెలియని పిల్లిలాగ కనబడతాడు . . వాడి ఒళ్ళంతా విషం . . ఏమో సామెత చెప్తారుగా . . పిల్లి చేసేదంతా అల్లరితనం, కాని దాన్ని కొడితే పాపం అని . . అలాగే . . ."

అది విని ఆంటీ " ఏమిరా, అలాగేనా?" అని అడుగుతూ నా వైపు చూస్తుంది. నేను మళ్ళీ నెమ్మదిగా ఆమెను చూస్తాను.

"నువ్వు ఊరుకోవే! ఎందుకి ఆ పిల్లవాడిని అస్తమానం ఇలాగ తిట్టడం? నువ్వు నాతో రారా . . " అనే ఆదరణ ఎంత ఇంపుగా ఉంది! కాని ఆ సానుభూతి చూపే వాళ్ళపైకూడా నాకు నిష్కళంకమైన మనసు లేదని నాకు మాత్రమే తెలుసు!

సరే, నేనేం అంటున్నాను? ఆ అగ్రహారం పిల్లి గురించి రంభించి - ఆ అగ్రహారంలోని మనుషుల గురించీ, నా గురించీ కదా చెప్తున్నాను? ఇరవై ఐదు సంవత్సరాల ముందు పదేళ్ళవరకూ నేను జీవించిన ఈ గ్రామం గురించి, ఈ ఊరి మనుషుల గురించి కావాలంటే ఎన్నో రోజులు ఎన్నో కబుర్లు నేను చెప్పగలను; అది నాకెప్పుడూ విసుగెత్తదు. ఇంకా చెప్పాలంటే నేను చెప్పుతూ, మాట్లాడుతూ, రాసే అన్ని సంగతులూ ఒకే ఊరులో, ఒకే వీధిలో ఉన్న మనుషుల గురించే. మీనా, రుక్కూ, పట్టు, లలితా, గౌరి అవ్వ, అనంత శర్మా, పైత్తా, రాఘవయ్యర్, గణపతి అయ్యర్, శంకర శర్మా - వీళ్ళందరికీ ఒక్కొక్కరి గురించే తెలుసు. వీళ్ళు అప్పుడు ఎలాగ ఉండేవారు, ఇప్పుడు ఎలాగ ఉంటారు అని కల్పించుకోడం; ఇందులో కొంతమంది ఎలాగ ఈ చెన్నపట్టణం ప్రభలో నా దగ్గర చిక్కుకున్నారు; కాల పరిస్తితులవలన కొంతమంది వొంగి పోవడం లేక ఆడిపోవడం; అలాగే మీ అవకుండా తప్పించుకోవడం; తగులుకున్నా ' ఏమీ అవలేదు ' అని అంటూ వొళ్ళు తుడుచుకోవడం; నా దగ్గరే

చిక్కుకొని నా ఖండనలు వినడం - - వీటిగురించి రాయడానికి నాకు విసుగు పుట్టదు; నాకు వాళ్ళమీద అటువంటి ప్రేమ; వాళ్ళకి సంభందించిన అన్ని సంగతులంటే నాకు గొప్ప!

కాని వాళ్ళలో కొంత మందికి ఇందులో విసుగు వచ్చేసిందేమో?

పాపం, వాళ్ళేం భయమా? ఏమిటో కష్టం. "ఎందుకండీ ఎప్పుడు చూసినా అగ్రహారంలో ఉన్న మనుషులగురించే రాస్తున్నారు?" అని నన్ను అడుగుతున్నారు.

నేనేం చేస్తాను? నాకు ఎది తెలుసో దాని గురించే కదా నేను రాయగలను? . . . సరే, ఒక సారి ఒక మార్పు కోసం ఈ అగ్రహారంలో ఉన్న మనుషులను వదలేసి నాకు తెలిషిన ఒక పిల్లి గురించి రాస్తాను. పిల్లలకెప్పుడూ భయమో, విసుక్కో ఏర్పడవు. పిల్లలు పుస్తకాలు చదవవు; వాళ్ళలో టక్కరితనం కనిపించినా అవి అటువంటి పనులేమీ చెయ్యవు.

నాకు పిల్లుల్ని చూస్తే ఒకటే అసహ్యం. నాకు కుక్కలు, పిల్లలు, ఇవన్నీ చూస్తే చిరాకు. కాని సింహం, పులి అంటే చాలా ఇష్టం; వాటిని ఎప్పుడూ చూడలేదుకదా? మనం ఏదైనా రోజూ చూసి మెలిగితే అందులో ఇష్టం లేకపోవడం మానవ స్వభావమే కదా? అందులోనూ, కుక్క, పిల్లి, పందికొక్కు - ఇవన్నీ ఎవరికి ఇష్టం? ఎవరికీ నచ్చవు. ఆ రోజుల్లో నా వినోదక్రీడ అంతా ఖూనీ చెయ్యడమే.

ఉత్తికే కూర్చుండి ఒక చీమను పట్టుకొని దాని రెండు కాళ్ళని గిల్లేసి అది ఆడే చిందులాట ఆనందించడం; ఒక పుల్లతో దాని వీపు మధ్య గుచ్చి, దాన్ని రెండు చేసి, ఆ రెండు భాగాలూ ఎలా గెంతుతాయి అని పరీక్షించడం; ఒక బల్లిని చంపి దాని తోక



ఎలాగ వొణుకుతుందని చూడడం; జెర్రీ, బల్లీ, నూతిపురుగు - వీటికి ఆ రోజుల్లో నేను యమకింకరుడని! మా వీధిలో దూరే ఏ కుక్కైనా సరే నన్ను చూడగానే దాని తరువాత ధైర్యంగా నా ముందు రాదు; అలాగే వాపసు అవుతుంది!

జయా ఆంటీగారి ఇంటి వసారాలో నేను ఉత్తికే కూర్చొని ఉన్నాను; పక్కనే ఒక బండరాళ్ళ గుంపు. అవన్నీ నేనే సెలెక్ట్ చేసి కూడపెట్టినవి. అదిగో! దూరంలో ఒక కుక్క వస్తోంది. ఇంతకు ముందు దాన్ని మూడు కాళ్ళలో నేను పరుగెత్తించాను. ఇప్పుడు ఒక స్థంబం వెనుక దాక్కొన్నాను. కొట్టేవాడే ఇంత ఉషారుగా ఉంటే ఆ కుక్కకి అది ఉండదా? రెండు చెవులనూ లేపి గభీమని నన్ను చూసింది! 'ఏమోయ్, నన్ను కొడతావా? నాపాటుకి నేను వెళ్ళిపోతానురా ' అన్నట్లు ఒక చూపు. నేను దాన్ని చూడనట్టు నా మొహం తిప్పుకున్నాను. దానికి కొంచం ధైర్యం ఎక్కువ. ఆ ఎదురింట్ల వరుస ఓరలో తన వెనుకటి రెండు కాళ్ళలో తోకను అదుముకొని నా మీద పెట్టిన కళ్ళను తీయకుండా మెల్లగా వస్తోంది. నా చేతులకి ఒకటే ఆత్రుత. పళ్ళు కొరుక్కుంటూ నన్ను ఇగ్గులాడుతున్నాను. అదిగో, నా ముందు వచ్చేసింది. చీ! ఆ వేగమంతా ఇప్పుడు పనికిరాదు. నేను ఏం చేసేనని ఎవరికీ తెలియదు. ఈ వీధిలో ఉన్నవారందరినీ కూడకట్టుకొన్నట్లు అది పరుగెడుతోంది! తలమీద గురి పెడతేనే కాలిలో పడుతుంది; అలాగే ఐంది! నేను ఉత్తికే ఏమీ తెలియనట్లు కూర్చున్నాను.

సబ్దం విని జయా ఆంటీ ఇంటిలోనుంచి వచ్చారు. నేను తటాలున వసారామీద ఉన్న రాళ్ళని కిందకు తోసేసాను.

"ఏమ్రా, ఎవరు కుక్కని కొట్టారు?"

"ఐయ్యో, నేను కాదండీ."

"సరే, ఎవరినైనా పిలు. స్నాన గదిలో ఒక పెద్ద పందికొక్కు బయటకు రాలేక నిలబడ్డాది; ఎవరినైనా రమ్మను."

అంతే, నేను వెంటనే ఒక పెద్ద కర్రతో లోపలికి వెళ్ళాను. ఆంటీ అరుస్తోంది: " వొద్దురా, మరెవరినైనా పిలు; అది నీ మీద గెంతుతుంది."

స్నాన గది చివరిలో నేను ఆ పందికొక్కుని కనిపెట్టేసాను. చాలా పెద్ద జంతువే. నన్ను చూసి గర్జిస్తూ నిలబడింది. తలపై గురిపెట్టి ఒక దెబ్బ! వెధవది, తన్నే ప్రదక్షణం చేస్తున్నట్లు స్నానగదిలోనే తిరిగి తిరిగి చివరకు రక్తం కక్కి చనిపోయింది. జయా ఆంటీ బెదరిపోయింది. నేను కూడా భయపడుతున్నట్లు ' ంటీ' ' ంటీ' అని అరిచాను; ఆపిడ పరుగెత్తుకొని వచ్చి నన్ను కౌగించుకుంది. " నీకు ఈ ఖర్మ వొద్దు అని చెప్పానుగా . . ఆ ఘోరాన్ని చూడకు . . రా . రాక్కాయి వస్తే కడగమని చెప్దాం . ."

భయపడి నిలబడే నన్ను జయా ఆంటీ అణుచుకుంది. పెద్దవాళ్ళు అణుచుకుంటే ఎంత హాయిగా ఉంది!

ఆ పందికొక్కు నన్ను చూసి అలా గర్జించకుంటే నాకు అంత కోపం వచ్చుండేది కాదు. అది తన గర్జన తరువాత తప్పించుకొని పారిపోయుంటే నేను ఏడ్చి ఉంటాను.

ఖూనీ చెయ్యడం తరువాత నాకు ఇంకొక వినోదక్రీడకుడా ఉంది. ఏమంటే ఒక జంతువుని ఖూనీ చేసిన తరువాత దాన్ని ముక్కలు ముక్కలుగా కోసి అమ్మడం చూసి ఆనందించడం. మా అగ్రహారం చివరలో ఒక మైదానం ఉంది. ఆ మైదానంలో ఉన్నవాళ్ళందరూ ఏమేమో బాషలు మాట్లాడతారు. మేకలు, ఆవులు, కోడి పుంజులూ - అన్నీ పెంచుతారు. అక్కడ ఒక



మీసాలవాడు ఉన్నాడు. వెంకిట్టు, సుందరం, ఉత్తండం - వీళ్ళి వాదిని చూస్తేనే ఒకటే హడలు! నాకు వాడిని చూస్తే భయం లేదు. వాడు ఎప్పుడురా మన వీధిలోకి వస్తాడు అని నేను కాచుకొని ఉంటాను. వాడు సాయంకాలం నాలుగు గంటలకి మా వీధి ద్వారా ఆ మైదానంకి వెళ్తాడు. నేను వాడిని చూస్తూ నిలబడతాను. నాకు వాడి మీసమంటే చాలా ఇష్టం. వాడు ఒక తుప్పు పట్టిన నల్ల సైకిలుపై వస్తాడు. అతను సైకిలులో రావడం చూస్తే ఒక మేక మీద ఒక మనిషి కూర్చొని సవారి చేస్తున్నట్లుంటుంది. ఆ సైకిలు హేండిల్ బార్ లో ఒక ఖాకీ సంచి ఉంటుంది. అది రక్త మరకలతో ఉంటుంది; ఈగలు మోస్తుంటాయి. ఆ సంచిలోని కత్తి చెయిపిడి మాత్రం కనిపిస్తుంది. నేను పెద్దవాడైన తరువాత వాడిలాగే పెద్ద మీసం పెట్టుకుంటాను; ఇంకా పెద్ద కత్తి వాడుతాను. ఎవరైనా దెబ్బలాటకి వస్తే వాళ్ళ తల కోసేస్తాను.

పెద్దవాడైన తరువాత తప్పకుండా మనుషులను ఖూనీ చేస్తాను. నన్ను చూసి అందరూ భయపడాలి . . నేనేం అంటున్నాను? అగ్రహారంలోని పిల్లి గురించి కదా చెప్పదలచుకున్నాను? పరవాలేదు, పిల్లి గురించి చెప్పడానికి సమయం వచ్చేసింది . . ఇక చెప్తాను . . .

మా అగ్రహారంలోనూ ఒక పిల్లి ఉంది; చాలా క్రూరమైనది. ఒక చిన్న పులిలాగ ఉంటుంది. దేహం నిండా వరుస వరుసగా రేఖలున్నాయి. దానికి ఈ అగ్రహారంలో ఏముందో? పిల్లి మాంసాహారి కదూ? అది మాంసం దొరికే జాగాలన్నీ వదిలేసి ఈ అగ్రహారంలో ఉంది. ఆ కారణంవలనే ఈ పిల్లి నిర్భందంగా ఒక శాఖారి పిల్లిగా ఐపోయింది. నాకూ దానికీ ఒక పోలిక ఉంది. నేను ఏమీ తెలియనట్లు కనబడుతాను, అదికూడా అలాగే ఉంటుంది. నేను అల్లరి చేస్తాను, అది కూడా అల్లరి చేస్తుంది. నేను అందరి ఇంట్లోను తుంటరితనం చేస్తాను, ఆ పిల్లికూడా అందరి ఇంట్లోనూ తుంటరితనం చేస్తుంది.

ఒక రోజు జయా ఆంటీ కూతపెట్టి శపించింది: "ఈ పెధవ పిల్లి పాలంతా తాగేసింది; ఆ పందికొక్కుని కొట్టినట్లు దీన్నికూడా ఎవరైనా కొట్టి చంపుతే బాగున్ను..."

ఉయ్యాలలో పడుకొని పిసనకఱ్ఱ వాడుతున్న ఆమె భర్త అన్నారు: " అలాంటి మాటలు చెప్తే పాపం . . ఒక పిల్లిని చంపాలని తలచడమే పెద్ద పాపం . . ." నేను ఉత్తికే సిలబడి ఆ మాటలు పింటున్నాను.

పందికొక్కుని చంపినట్లు పిల్లిని ఖూనీ చెయ్యలేమని నాకు తెలుసు. పందికొక్కు గర్జించింది కదా . . పిల్లి అలాగే గెంతి దేహాన్ని చింపి పారేస్తుంది . .పిల్లి ముందు భయపడుతుంద, అరుస్తుంది, పారిపోవడానికి ప్రయత్నం చేస్తుంది . . . . మరేం దారి లేకపోతే ఒక తాకు! నాకు జ్ఞాపకం లేని వయసులో ఒక పిల్లి నా పొట్టలో గోకిన మచ్చ ఇప్పుడుకూడా నా మొలతాడు కట్టే ప్రాంతంలో పొడువుగా కనబడుతుంది. అది చిన్న పిల్లవాడిగా నేను దోగాడిన వయసు . . పిల్లిని పట్టుకొని సర్కసు కూడా చేసి ఉన్నాను . . తెలియక ఆ పిల్లి మెడను పట్టుకున్నానట . . అది గర్జిస్తూ నన్ను తన పంజాలతో గోకింది . . నేను అరుస్తూ దాని మెడని వదలలేదట . . అమ్మ ఇప్పుడుకూడా చెప్తుంది . . ఆ మచ్చ ఇంకా నా పొట్టలో ఉంది . . .

రోజు సాయంకాలం మా ఇంటి తోటలో ఆ పిల్లిని చూసాను. మా ఇంటికీ పక్క ఇంటికీ మధ్య ఉన్న దడిగోడలో నడిచివెళ్తోంది. వెళ్ళేటప్పుడు నన్ను ఒక సారి చూసింది; నేనూ చూసాను. ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూసాను. అది కూడా కొంచం ఉషారుగా నన్ను బాగా చూసింది. నేను దాని మీద దూకుతున్నట్లు గెంతీ భయపెట్టాను. అది భయపడలేదు. కొంచం నేలమీద వొంగి మళ్ళీ సిలబడింది. అంతే . . ' ఎందుకు దీనికి మన దగ్గర భయం లేదు? ' అని నాకు ఒకటే కోపం . .అదికూడా



నన్ను లెక్క చెయ్యనట్లు చూస్తోంది . . ఇదంతా ఒక మౌన సవాలు అని చెప్పాలి . . ఎర్రగా తన నోరు తెరిచి ఆ పిల్లి 'మియావ్ ' అని అరవగానే - సరే, ఇది తన బాషలో నన్ను సవాలుకు పిలుస్తున్నట్లు అనిపించింది:

' అదంతా ఆ పందికొక్కు దగ్గర ఉంచుకో . . ఇక్కడ నీ పప్పేం ఉడకదు . .'

' ఉండు, ఉండు . . రేపు నీను పట్టి, ఒక గోనే సంచిలో అణచి, ఒక బండ రాయి మీద కొట్టి . . ."

' మియావ్, అదేం జరగదు; ముందు నన్ను పట్టుకో చూద్దాం. .’ తటాలున ఆ గదిగోడని ఆ పిల్లి దాటేసింది. పక్కింటి తోతలో సిలబడి మళ్ళీ నన్ను చూస్తోంది.

'ఎక్కడకి వెళ్ళిపోతావ్? సిన్ను పట్టకపోతే నీ పేరు మార్చుకో! ' అని చెప్పాను నేను.

దానికి జవాబు చెప్తున్నట్లు ఇంకొక మియావ్ కూత! దానికి అర్థం, ' సరే చూద్దాంలే' అని.

'సరే చూద్దాం,' అని నేను బదులు చెప్పాను. ఆ రాత్రంతా నేను నిద్ర పోలేదు. ఆ పిల్లి కూడా నిద్ర పోలేదు; రాత్రంతా ఇక్కడా, అక్కడా పరుగెడుతోంది. ఇంకొక పిలిని చేర్చుకొని ఒక రాక్షస బిడ్డ కూతలు పెడుతున్నట్లు రెండూ ఒకరిపై ఒకరు గెంతుతూ . . గోకుతూ . . . మా ఇంటి అటక మీద ఒకటే హాఠం! ఎక్కడనుంచో ఒక కుండ పెంకు జారి కిందకు పడింది. వసారాలో పడుకున్న మా తాతగారు, చేతి కఱ్ఱను తీసుకొని, నేలమీద కొట్టి వాటిని తరిమారు. రెండు పిల్లులూ వీధిలో అడ్డంగా పరుగెత్తి జయా ఆంటీ ఇంటిలోకి దూరడం నేను వెన్నెలలో బాగా చూసాను.

ఇక మరు నాడు దాన్ని వేటాడి తీరవలసిందే అని నిశ్చయం చేసుకున్నాను. జయా ఆంటీ స్నాన గదిలో ఒక కంచం నిండా పాలు పెట్టాను. ఒక తలుపు మాత్రం తెరిచి ఉంచాను. కిటికీ తలుపు మూసేసాను. మధ్యాన్నం భోజనానికి కూడా ఇంటికి వెళ్ళకుండా కాచుకున్నాను. ఆఖరికి మూడు గంటలకి 'గురువుగారు' దర్శనమిచ్చారు. నేను తోటలోని బావినుంచి అలాగే చూస్తున్నాను . . మెల్లిగా అడుగు మీద అడుగు పెట్టి పిల్లిలాగే నడిచాను. 'అతని' వీపు మాత్రం కనిపించింది; ఒక కంచం పాలుని త్వరగా ఖాళీ చేస్తున్నారు. గభీమని తలుపు మూసేసాను. లోపల చిక్కుకున్న పిల్లి వెంటనే పాలుని మరచి తలుపుని పాముతోంది.

"ఆంటీ, రండి, రండి . . ఇక్కడ గురువుగారు చిక్కుకున్నారు " అని అరిచాను. ఆంటీ వచ్చి చూసింది. . . లోపల పిల్లి కూతలు పెడుతోంది.

"అదే మిత్రా, స్నాన గదిలో పిల్లిని పెట్టుకొని గదిని మూసేస్తే మనం ఎలాగ లోపలకి వెళ్ళడం? మనం వెళ్ళగానే అది బయటకు రాదూ?"

"ఇప్పుడే మొదటి ఘట్టం పూర్తి అయింది; ఇందులో మనకే జయం. మీరు వెళ్ళండి . . ఆఖరి ఘట్టంలో పిలుస్తాను . ."

ఆంటీకి పందికొక్కు జ్ఞాపకంలో వచ్చింది కాబోలు.

"వొద్దురా, దానేం చెయ్యకు. ఈ జన్మకి అటువంటి మహా పాపం వొద్దురా . . . "



" నేను దాన్ని చంపను ఆంటీ . . ఒక గోనె సంచిలో వేసి దాన్ని ఈ ఊరునుంచి తరుముతాను . . "

"బాగా చెప్పావులే . . నువ్వు దాన్ని తరిమేసి తిరిగి వచ్చేసరికి ఆ పిల్లి ఇక్కడకి వచ్చి నిలబడుతుంది . ." జయా అంటీ నన్ను పరిహాసం చేసి వెళ్ళింది. నేను మనసులో అనుకున్నాను: 'దీన్ని తిరిగిరాని ఊరుకి పంపించే వస్తాను నేను ' అని.

అగ్రహారంలో ఆ రోజు నేనే హీరో! ఆటలాడే సమయంలో నన్ను చేర్చుకోని కుఱ్ఱవాళ్ళందరూ అవాళ నా వెనుక వస్తున్నారు. నేను పిల్లిని గోనెలో కట్టుకొని వెళ్తున్నాను. బొబ్బలిట్టుకుంటూ పిల్లకాయలందరూ నా వెంటన నడుస్తున్నారు. అమ్మ ఇంటి ముందు నిలబడి నన్ను తిట్టుతోంది.

"ఒరే దొంగ వెధవా, నాశమై పోతావురా . . పిల్లిని చంపి ఆ పాపం చెయ్యవద్దు . . ఒక వెండ్రుక పోయినా పిల్లి బరువుకి సమానంగా బంగారం ఇవ్వాలని పెద్దవాళ్ళు చెప్తారు . . మీ నాన్నగారు రానీ . నిన్ను చంపి . . ." నేను అవేమీ చెవిలో వేసుకోలేదు. ఆ గోనెను ఎత్తుకొని తిన్నగా అందరం ఆ వీధి చివరన ఉన్న గుడిలో వచ్చి కూర్చున్నాం.

"గోనెలోనుంచి పిల్లిని బయటకు తీసి దాని మెడలో ఒక తాడు కట్టి అందరికీ తమాషా చూడవచ్చు," అని ఉత్తండం ఆలోచన చెప్పాడు. కాని పిల్లికి ఎవరు తాడు కట్టడం?

"అదేం వొద్దు; ఆ మీసాలవాడు ఇప్పుడు వస్తాడు. వాడి దగ్గర దీన్ని ఇస్తే చాలు; అలాగే గోనెతో కలిసి ఒక పోటుతో దీని ఆటలన్నీ క్లోజ్ . ."

"వాడిని నువ్వే అడగాలి," అని ఆ మీసాలవాడు రావడానికి ముందే సుందరం భయంతో చెప్పాడు. ఈ కుఱ్ఱవాళ్ళని పెట్టుకొని ఈ పని చెయ్యడం మంచిది కాదు; భయపడిపోతారు.

"ఒరేయ్, మీరందరూ ఇంటికి వెళ్ళండి. వాడు పిల్లిని ఖూనీ చెయ్యడం చూస్తే మీరు భయపడతారు. తర్వాత మీ అమ్మ నన్ను తిట్టుతోంది!" నేను వీళ్ళందరినీ తరుముతున్నాను.

"అవాళ వాడు మేకని కోసినప్పుడు . . నువ్వు చూపించావుగా . . నేను భయపడ్డానా? నేను ఉంటానురా . . "

"ఐతే ఒక మాట . . దీని గురించి ఎవరూ ఇంట్లో ఏమీ చెప్పకూడదు . . . ఒట్టు పెట్టండి!" అన్నాను.

"ఎవరికీ చెప్పం." అందరూ కలిసి ఒకటే కూత.

ఆ మీసాలవాడికోసం మేం కాచుకొని ఉన్నాం.

ఆఖరికి సాయంకాలం నాలుగు గంటలకి ఒక మేక మీద కూర్చొని ఒక మనిషి సవారి చేస్తున్నట్లు వీధి చివరలో వాడు రావడం తెలిసింది. కుఱ్ఱవాళ్ళందరూ మండపంలో స్థంబాల్లో వెళ్ళి దాక్కొన్నారు. " మేం ఇక్కడే ఉంటాం. నువ్వు వెళ్ళి వాడిని అడుగురా . . " అని అనేసారు. నాకేం భయం?

మీసాలవాడు దగ్గర వచ్చేసాడు. నేను వాడికి ఒక ' గుడ్ మార్నింగ్ ' చెప్పాను; అతను నాకొక శలాం పెట్టాడు!

అతను తన రెండు కాళ్ళను నేలమీదనే ఆనుకొని సైకులునుంచి లేవకుండానే సిలబడ్డాడు. నాయీనా . . ఎటువంటి ఆజానుబాహువు! నేను తల ఎత్తి మాట్లాడాను:



" మీరు కొంచం దయచెయ్యాలి . . "

"అదేంటది, గోనెలో?" అతని ధ్వని కృష్ణ లీలలో వచ్చే కంసుని ధ్వనిలాగ ఉంది.

" ఈ పిల్లి . . . . చాలా అల్లరి చేస్తోంది. అందువలన దాన్ని చంపడానికి ఈ గోనెలో పట్టుకొని తీసుకొచ్చాను . . "

" నువ్వా దాన్ని పట్టావ్?" నేను గర్వంగా తల ఊపాను. అతను మండపంలో దాక్కొన్న కుఱ్ఱవాళ్ళని ఒక సారి చూసాడు. తరువాత నన్ను చూసాడు. నేను ఆ ఖాకీ సంచిలో ఉన్న ఆ కత్తి చెయిపిడి చూస్తున్నాను.

" పిల్లిని చంపడానికి కత్తి కావాలా?" అని అతను నన్ను అడిగాడు.

"ఊహూం . . మీరేకదా మేకల్ని కోస్తారు . . అందువలన దీన్నికూడా మీరే చంపాలి . . ."

" ఓ, అలాగా?" అని ఆలోచిస్తూ అతను ఆ కత్తిని బయటకు తీసాడు. చాలా పెద్ద కత్తి! ఒక చేతి వేలుని కత్తి మొనలో పెట్టి దాన్ని పరీక్షించాడు.

" నేను ఇంతవరకు పిల్లిని ఖూనీ చెయ్యలేదు. ఎందుకంటే మేం పిల్లి మాంసం తినం. సరే, నేను కోస్తాను, మీరు తింటారా?"

" మనం పిల్లిని పాతేదాం . . "

"అప్పుడే పాపం లేదు. నేను ఎందుకు మేకను చంపుతాను? ఎందుకంటే దాన్ని అందరూ తింటారు. వాళ్ళు తినకపోతే నేను చంపను. నేను మేకను చంపడం నువ్వు చూసి ఉన్నావా?"

"ఓ, తప్పకుండా . . మీరు ఏదో మంత్రం చెప్పి దాని గొంతు కోస్తారు . . ఆ మంత్రం చెప్పి ఈ పిల్లిని కూడా చంపండి . . అప్పుడు పాపం లేదు . . ."

"మంత్రాలు చెప్పడం అందుకోసం కాదోయ్ . . ఒక పని ఆరంభించినప్పుడు దేవున్ని ప్రార్థిస్తాం కదా? అందుకే . . జంతువులని చంపడం తమాషా కాదు . . అది నా కుటుంబానికి గంజె పోస్తోంది .. . అందుకోసం నేను నీ దగ్గర డబ్బేం అడగను . . సరే, చంపుదాను, నువ్వు తింటే సరి . . దేన్నీ పాడు చెయ్యకూడదు . . పాడు చేస్తే అది హత్య! అది పాపం! . . ఏమంటావ్? "

"ఇవాళ మాత్రం తమాషాకి ఈ పిల్లిని చంపండి . . ."

అతను నవ్వుతూ, నా గడ్డాన్ని మెల్లిగా ఎత్తి, చేతితో తడుముతూ అన్నాడు; అతని వేలు గరికుగా ఉంది:

"తమాషాకి చంపమంటావా? తమాషాకి చంపాలంటే ఈ కత్తి పిల్లితో ఆగదు . . నిన్ను అడుగుతాను: తమాషాకి నిన్ను చంపుతే ఎలాగ ఉంటుంది? . . ."

నాకు దేహమంతా ఒకటే ఒణుకు.

"మరి ఈ పిల్లి అల్లరి చేస్తుందే?"



"నువ్వు అల్లరి చెయ్యడం లేదా? పిల్లంటే అల్లరి చేస్తుంది. అల్లరితనం చెయ్యడంవలనే దానికి పిల్లి అని పేరు. అలాగే నువ్వుకూడా తుంటరితనం చేస్తావు. కుఱ్ఱవాళ్ళుకూడా అల్లరి చేస్తారు: పిల్లలుకూడా చెయ్యనీ! ఇంట్లో వంటగదికి తాళం వెయ్యమని చెప్పు . . ." అని అంటూ నా చేతిలో ఉన్న గోనె సంచిని తీసి ఒక ఊపు ఊపాడు ఆ మీసాలవాడు. ఒకటే గెంతు! తిరిగి చూడకుండా ఆ పిల్లి పారిపోయింది. కుఱ్ఱవాళ్ళందరూ నవ్వారు; మీసాలవాడు నవ్వాడు; నేను కూడా నవ్వాను.

ఆ రాత్రి అంతా నేను ఏడ్చాను; ఆ పిల్లి తప్పించుకొని పారిపోయిందని కాదు; నేను తమాషాకి చంపిన పురుగులూ, బల్లెలూ, పందికొక్కులూ . . పాపం, ఆ కుక్క! వాటందరినీ తలుచుకొని ఏడ్చాను!

నేను ఇప్పుడు ఆ అగ్రహారంలో లేను . . . ఇప్పుడుకూడా ఆ అగ్రహారంలో అలాంటి పిల్లి ఉంటుంది కదూ?

******